ఆర్‌టిసి కార్గో సేవలను వినియోగించుకోండి

ఏలూరు అర్బన్:ఆర్‌టిసి అందిస్తున్న కార్గో సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆర్‌టిసిని ఆదరించడంతోపాటు తక్కువ ఛార్జీలతో డోర్ డెలివరీ సౌకర్యం పొందాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వికె.వరప్రసాద్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసి నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు కార్గో సేవలపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఏలూరు డిపో ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏలూరు డిపో గ్యారేజ్ నుండి బయలుదేరిన ర్యాలీ జిల్లా పరిషత్ కార్యాలయం, ఫైర్‌స్టేషన్, ఆర్‌ఆర్ పేట మీదుగా తిరిగి గ్యారేజ్ వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన వరప్రసాద్ మాట్లాడుతూ కార్గో సర్వీసులు అత్యంత వేగంగా కేవలం 24 గంటల్లోనే మనం అనుకున్న ప్రదేశాలకు చేరుతున్నాయని, అతి తక్కువ ధరతో అత్యంత వేగంగా నడుస్తున్న కార్గో మరియు డోర్ డెలివరీ సేవలను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, కార్గో కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జి.మురళీ, పిఆర్‌ఓ కెఎల్‌వి.నరసింహం, కార్మికులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జిల్లాలో కరువు లేదంట..!

'కరువు' జాబితాలో ఉమ్మడి జిల్లాలో ఒక్క మండలమూ లేదు

వేలాది ఎకరాల్లో ఎండిన పంటలు

ఏలూరు జిల్లాలో పరిస్థితి దారుణం

వానాకాలం మూడు నెలలూ లోటు వర్షపాతమే

తగ్గిన భూగర్భ జలాలు, అడుగంటిన చెరువులు

ఎండిన పంటల నివేదిక తయారీలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం..!

జిల్లా ఊసెత్తని ప్రభుత్వం

లబోదిబోమంటున్న బాధిత రైతులు



చాట్రాయి మండలం నరసింహారావుపాలెంలో సాగునీరు లేక ఎండిపోయిన వరి పొలంలో గేదెలను మేపుతున్న రైతు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'వర్షాభావంతో పంటలు దెబ్బతిని కరువు కమ్ముకొచ్చినా ప్రభుత్వంలో చలనం లేదు.. ఉమ్మడి జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా గుర్తించలేదు.. అసలు జిల్లా ఊసే ప్రభుత్వానికి లేకుండా పోయింది.. దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి పంపించే ఆలోచన కూడా అధికారులు చేయలేకపోయారు. మూడు నెలల వర్షపాతం లోటు ఏర్పడి నీటిఎద్దడి సమస్యతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నప్పటికీ అధికారులకు, ప్రభుత్వానికి కనిపించకపోవడం దారుణం..' అంటూ ఉమ్మడి జిల్లా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో 103 మండలాలను కరువు మండలాలుగా ఈనెల 30వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన లెక్కలన్నీ తప్పుల తడకలన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కరువును తగ్గించి చూపేందుకు కరువు విలయతాండవం చేస్తున్న మండలాలను సైతం చేర్చలేదన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో పలుమండలాల్లో కరువు విలయతాండవం చేస్తున్నా ప్రభుత్వ జాబితాలో కనిపించకపోవడం వెనుక అధికారుల తప్పిదమా.. లేక ప్రభుత్వ నిర్లక్ష్యమా అన్న ప్రశ్నలు జిల్లావాసులను తొలిచేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం నాలుగు నెలల్లో జూలై నెల మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలల్లో జిల్లాలో సరైన వర్షాలే పడలేదు. జూన్‌లో 112.5 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. మైనస్ 23.3 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 212.4 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 90.9 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఏకంగా మైనస్ 57.2 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఏర్పడింది. ఇక వర్షాకాలం ఆఖరునెల సెప్టెంబర్‌లోనూ 171.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం పడాల్సి ఉండగా కేవలం 137 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. మైనస్ 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఉంది. ఈ ఏడాది పెద్దఎత్తున వర్షపాతం లోటు ఏర్పడి నీటి ఎద్దడి సమస్య రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. డెల్టాలోనూ సాగునీటి కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఏలూరు జిల్లా మెట్టప్రాంతంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారింది. చెరువులు అడుగంటాయి. బోర్ల నుంచి వచ్చే నీళ్లు తగ్గిపోయాయి. రోజంతా మోటారు ఆడించినా ఎకరం కూడా తడవడం లేదు. చింతలపూడి మండలంలో ఏకంగా ఐదువేలకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. చాట్రాయి మండలంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ముసునూరు మండలంలోనూ సాగునీటి సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్వారకాతిరుమల, కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లోనూ పరిస్థితి దారుణంగా మారింది. పొలాల్లో మోటార్ సైకిళ్లు నడిచేలా భూములు నెర్రలు తీశాయి. నీరులేక ఎండిపోయిన పంటలు పశువుల మేతగా మారిపోయాయి. రైతులు ఎకరాకు రూ.25 వేలకుపైగా నష్టపోయారు. పలు మండలాల్లో పత్తిపంట సైతం దెబ్బతింది. పశువులకు తాగునీరు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటిస్తుందని, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. కరువు మండలాల జాబితాలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క మండలం కూడా లేకుండా పోయింది. దీంతో పంటలు దెబ్బతిన్న రైతుల పరిస్థితి ఏమిటంటూ రైతుసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఈ విధంగా గాలికొదిలేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని అధికారులు నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణమన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతోంది. దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సైతం అధికారులు శ్రద్ధ చూపలేదు. నేడు ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా సైతం దాన్నే ధృవీకరిస్తోంది. ఉసూరుమంటున్న రైతులను ఎవరు ఆదుకుంటారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది.

నాలుగునెలల వర్షపాతం వివరాలు

నెల	కురిసిన వర్షం(మిల్లీ మీటర్లలో)	కురవాల్సింది	కురిసింది
జూన్	86.3	112.5	-23.3
జులై	319.8	242.9	ప్లస్31.7
ఆగస్టు	90.9	212.4	-57.2
సెప్టెంబర్	137	171.5	-20.1



ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

గిరిజనుల సాగు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ

ఐటిడిఎ వద్ద మహాధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తరతరాలుగా 1/70, ఎల్‌టిఆర్ భూములను పోడు చేసుకుని జీవిస్తున్న గిరిజనులకు సాగుహక్కు పట్టాలివ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని కోటరామచంద్రపురం ఐటిడిఎ వద్ద పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. 1/70, ఎల్‌టిఆర్, 2006 జాతీయ హక్కుల చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాలని, ఏజెన్సీలో ఆయిల్ కర్మాగార నిర్మాణం ఆపాలని, మాతృభాష విద్యా వాలంటీర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవి, రామకృష్ణ మాట్లాడుతూ 2004లో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రెడ్యానాయక్ ఏజెన్సీ పరిధిలో మూడు మండలాల్లో సుమారు 55 వేల ఎకరాలను అన్యాక్రాంతమయ్యాయని అసెంబ్లీలో ప్రస్తావించారని గుర్తుచేశారు. ఆ భూముల్లో అత్యధిక మంది గిరిజనులు సాగు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం రికార్డులను సవరించి చేయకుండా ఇష్టారాజ్యంగా ఉంచారని విమర్శించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూముల సాగుకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని అడవిలో జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టం 2006ను ప్రకారం గ్రామసభలు నిర్వహించి హక్కు పట్టాలివ్వాలన్నారు. ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తూ పోడు సాగు చేస్తున్న వారికి హక్కు పట్టాలిచ్చేందుకు సంసిద్ధంగా లేదని విమర్శించారు. పోడు భూములకు పట్టాలిచ్చేందుకు గ్రామ సభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని, 18 ఏళ్ల పోలవరం నిర్వాసితులకు సరైన ప్యాకేజీ అందలేదని తెలిపారు. నిర్వాసితుల కోసం సేకరించిన భూమిని అత్యధిక ప్రాంతాల్లో కొద్దిమంది గిరిజనేతరులే ఆ భూములను సాగు చేస్తున్నారని ఇది చట్టం విరుద్ధమన్నారు. జీలుగుమిల్లి మండలంలో ఆయిల్‌పామ్ తయారీ ఫ్యాక్టరీ నిర్మాణంను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణంపై ఎంఎల్‌ఎ, ఎంపి ఇరువురు స్థానిక ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ఐటిడిఎ పరిధిలో 101 మంది మాతృభాష విద్యా వాలంటీర్లు పనిచేస్తున్నప్పటికీ వారికి నాలుగు నెలల బకాయిలు నేటికీ అందలేదన్నారు. గిరిజనులు అన్యాయం చేసిన గిరిజనేతరులపై ఫిర్యాదులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనేతరులు ఇచ్చిన ఫిర్యాదుతో గిరిజనులను పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తున్నారన్నారు. భూ వివాదాల్లో ఇరువర్గాల రికార్డులను పరిశీలన చేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. నాయకులతో, తహశీల్దార్‌తో సంయుక్త సమావేశం నిర్వహించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజకు అందజేశారు. సిపిఎం ఇచ్చిన వినతి ఆధారంగా ఆర్‌ఒఎఫ్‌ఆర్ గ్రామ సభలు, ఉభయుల సమావేశం తేదీలను రాత పూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, ఎ.ఫ్రాన్సిస్, నాయకులు పోలోజు నాగేశ్వరరావు, ఉడత వెంకటేష్, చుండ్రు బుల్లెమ్మ, వెట్టి వీరయ్య, బొరగం భూచంద్రం, జి.గంగరాజు, కె.శ్రీను పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ వైఖరికి సిపిఎం ఖండన

ఏలూరు అర్బన్:పోలవరం ఏజెన్సీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించిన సందర్భంగా పిటిషన్ తీసుకుని సమస్యలపై చర్చించి రాతపూర్వక హామీ ఇస్తానని మాటఇచ్చిన కొద్దిసేపటికే రాతపూర్వక హామీకోసం ఎదురుచూస్తున్న గిరిజనులకు అందుబాటులో లేకుండా మొహం చాటేసిన ఐటిడిఎ పిఒ వైఖరిని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గిరిజనుల సమస్యలపై కెఆర్‌.పురం ఐటిడిఎ కార్యాలయం వద్ద ఉదయం నుంచి ధర్నా చేస్తున్నప్పటికీ సాయంత్రం ఐదు గంటలైనా పిఒ కనీసం గిరిజనులకు సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నాయకులు ఫోన్ చేసినా ఎత్తలేదని, మెసేజ్ కొట్టినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది గిరిజనులను ఆఫీసు బయట రోజంతా కూర్చోబెట్టి మొహంచాటేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన సంక్షేమం కోసం పనిచేయాల్సిన కార్యాలయం ఈ విధంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఇది గిరిజనులను అవమానించడమేనన్నారు. తక్షణం గిరిజనుల సమస్యలపై చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి- విలేకరులు

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన ఏలూరులో కుండపోత వర్షం పడింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉన్నప్పటికి సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరుచేరింది. ముఖ్యంగా పవర్‌పేట, శ్రీనివాస థియేటర్ రోడ్లలోకి మోకాళ్లలోతు నీరు చేరింది. అలాగే భీమడోలు మండలం గుండుగొలనులో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన ముదినేపల్లి, పరిసర గ్రామాలు, పెదపాడు, పెదవేగి, దెందులూరు తదితర మండలాల్లో మోస్తరు వర్షం పడింది.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



వినతిని అందిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జంగారెడ్డిగూడెం ట్రాన్స్‌కో డిఇ పి.రాధాకృష్ణకు సిఐటియు ఆధ్వర్యంలో మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ మీటర్ రీడర్లు 25 సంవత్సరాలుగా అనేక సమస్యలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఒకవైపు కాంట్రాక్టు వ్యవస్థతో అనేక సమస్యలు ఎదుర్కొంటూ మరోపక్క టార్గెట్స్ పెట్టి పనులు చేయించుకుంటున్నారని తక్షణ వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. సిఎం జగన్ పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటి వరకూ అమలు చేయలేదని విమర్శించారు. మీటర్ రీడర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్లో మీటర్ రీడర్ల ఫోన్లు రీఛార్జి చేయడం లేదని, ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు ప్రతినెల 15, 16 తేదీకి ఇస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ సరిగా అమలు చేయడం లేదన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రీడర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ వేయాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ డిఇ రాధాకృష్ణ స్పందించి కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్ల జిల్లా అధ్యక్షులు ఓగిరాల శ్రీనివాస్, నాగేశ్వరరావు, మల్లేశ్వరరావు, సిద్ధు, లోకేష్, మురళీ, సురేష్ పాల్గొన్నారు.



రక్తమార్పిడి చేస్తున్న వైద్యులు, అధికారులు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి చేసినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. రెడ్ క్రాస్ వైద్యులు ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు తలసేమియా చిన్నారులను పరీక్షించి అవసరమైన మందులను సూచించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ జన్యుపరమైన వ్యాధులు రాకుండా ఉండాలంటే పెళ్లి చేసుకోబోయే యువతి యువకుల ముందస్తుగా కొన్ని రకాల రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఛైర్మన్ వి.కృష్ణమోహనరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి కెవి.సీతారాం, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

భాస్కర్‌రావు అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - చాట్రాయి

నివాళులర్పిస్తున్న డిఎన్‌విడి.ప్రసాద్, నాయకులు

సిపిఎం మండల కార్యదర్శి కె.భాస్కర్‌రావు అంత్య క్రియలు ఆయన స్వగ్రామం చాట్రాయిలో బుధవారం ముగిశాయి. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మృతదేహాన్ని పార్టీ, వివిధ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ భాస్కర్‌రావు మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటు అని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు అన్నారు. జొన్నలగడ్డ నుండి చాట్రాయికి వృత్తిపరంగా ట్రాక్టర్ మెకానిక్‌గా వచ్చిన ఆయన 2003లో పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితుడై పార్టీలో కార్యకర్తగా చేరి మండల కార్యదర్శిగా ఎదిగారని తెలిపారు. ఆయన తల్లి మంగమ్మకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలుకాగా ఆయన వృత్తిపరంగా చాట్రాయిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారని ఈ క్రమంలో పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారని ఆరుగొలనుపేట, జనార్ధనవరం తదితర ప్రాంతాల్లో భూ పోరాట ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఆయన కుమారుడు లెనిన్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారన్నారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి, నూజివీడు పార్టీ సభ్యులు నారాయణ, హనుమాన్, సిఐటియు నాయకులు టిఎన్ఎం సూరి, మహిళా మండల అధ్యక్షురాలు హోలీ మేరీ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్,జెసి, అధికారులు

నిరాడంబరుడు, త్యాగమూర్తి, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. ఏలూరులోని కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జెసి లావణ్యవేణి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం గౌతమీ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత, ఎస్‌సి కార్పొరేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుముదిని సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ ఎస్.రమాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు బాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. జెసి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది, పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి అడ్మిన్ ఎంజెవి.భాస్కరరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్‌ఎస్.శేఖర్, పోలీస్ ప్రధాన కార్యాలయ పరిపాలన అధికారి నాయక్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : ఆంధ్ర రాష్ట్రం కోసం మొక్కవోని దీక్షతో పోరాడిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోతారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట అన్నారు. స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు జోషి, రామయ్య గౌడ్, లక్షణ కుమార్, వైద్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర అవతరణ వేడుకలు జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు వంటి మహనీయుల త్యాగఫలితమే భాష ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని, వారి త్యాగాన్ని స్మరించుకోవడం గొప్ప విషయంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రిసోర్స్ కేంద్రం సమన్వయకర్త ఒ.శిరీష, పరిపాలన అధికారి ఎంవి.కిషోర్, సీనియర్ సహాయకులు వై.సురేష్, డిపిఎం సత్యపులి, కె.సునీత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

ప్రజాశక్తి - భీమడోలు

పంటకోత ప్రయోగం పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. భీమడోలు మండలంలో ఎంపిక చేసిన వ్యవసాయ క్షేత్రాల్లో కొనసాగుతున్న పంటకోత ప్రయోగాలను బుధవారం ఆయన పరిశీలించారు. దీనిలో భాగంగా సూరప్పగూడెంలో జరుగుతున్న కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి, వ్యవసాయాధికారి ఉషారాణి భీమడోలు మండలంలో కొనసాగుతున్న వ్యవసాయ ప్రగతిని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ జిల్లాపరిధిలో 1.96 లక్షల ఎకరాలు వరిసాగు జరిగిందన్నారు. దీనిలో భాగంగా డెల్టా ప్రాంతంలో 95 వేల ఎకరాల్లో వరిసాగు జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా 5.60 లక్షల టన్నుల దిగుబడి అంచనా వేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు కలెక్టర్, జెసి ఆదేశాల మేరకు పౌరసరఫరాల సంస్థ సహకారంతో 261 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసిందని వివరించారు. ఇప్పటి వరకూ జిల్లాలో కొనసాగిన పంటకోత ప్రయోగాల ఆధారంగా ఎకరాకు 75 కేజీల బరువు గల 40 నుంచి 55 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ప్రస్తుతం చేపట్టిన పంట కోత ప్రయోగాల ఆధారంగా దిగుబడులను అంచనా వేసి ఆ మేరకు ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తామన్నారు. గత 45 రోజులుగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా మెట్ట ప్రాంతంలో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు డెల్టాలోని మారుమూల ప్రాంతాల్లో సాగునీరు అందక ఈ తరహా పరిస్థితులుంటాయని ఆ ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయన పేర్కొన్నారు ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను అధిగమించే క్రమంలో జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీని ఆధారంగా వ్యవసాయ క్షేత్రం నుంచి ధాన్యం మిల్లుకు చేరే రవాణా సమయం, అక్కడ వేచి ఉండే సమయాలను లెక్క కట్టి రైతులకు ఇబ్బంది లేని విధంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలను తీసుకుందని వివరించారు దీనివల్ల రైతులు మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి కోసం వేచి ఉండే వ్యవధి గణనీయంగా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిధిలో వరి కోతల ప్రారంభమయ్యాయని, దీనిలో భాగంగా ఉంగుటూరు డివిజన్ పరిధిలో 800 ఎకరాలకు విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయని తెలిపసారు. దిగుబడి వచ్చిన ధాన్యంలో కొద్దిపాటి తేమ ఉన్నప్పటికీ మిల్లర్లు ఇబ్బంది లేకుండా కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో మిషన్ కోత ద్వారా దిగుబడి వచ్చిన ధాన్యం పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో మిల్లులకు చేరేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, భీమడోలు సహాయ గణాంకాధికారి పాల్గొన్నారు.

జాతీయ దత్తత మాసోత్సవం

ఏలూరు:మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ దత్తత మాసోత్సవం స్థానిక శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ ప్రతీ ఏడాది నవంబర్ నెలను దత్తత మాసోత్సవంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏ ఒక్క చిన్నారీ అనాధగా ఉండకుండా వారికి మంచి జీవితం అందించాలనే కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా నవంబర్ మాసమంతా దత్తత స్వీకరణ కార్యక్రమంపై ప్రచారం చేస్తూ అనేక అవగాహనా కార్యక్రమములు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మంచి కుటుంబాన్ని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సూర్యచక్రవేణి మాట్లాడుతూ చిల్డ్రన్ హోమ్‌లో చాలా సంవత్సరాలుగా ఉంటున్న పెద్ద పిల్లలను తల్లిదండ్రులు, సంరక్షకులు లేని వారిని దత్తత ప్రక్రియలోకి తీసుకు వచ్చి వారిని దత్తత ఇచ్చి వారికి మంచి కుటుంబాన్ని అందించడం జాతీయ దత్తత మాసోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ కేర్ హోమ్, ఆరోగ్య శాఖ, పోలీస్ డిపార్టుమెంట్, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంబంధాల శాఖ వారు సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలిపారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేశ్వరావు మాట్లాడుతూ చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాధల పిల్లలను వారి వ్యక్తిగత రిపోర్టులు పరిశీలించి వారికి లీగల్ ఫ్రీ ఫర్ అడాప్షన్ ఆర్డర్ ఇచ్చి వారిని దత్తత ఇచ్చి మంచి కుటుంబ వాతావరణంలో పెరిగేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర హోమ్ సూపరింటెండెంట్ మురళీధరన్, డిపిఒ దుర్గాప్రసాద్, సైకాలజీ కౌన్సిలర్స్ వీర్రాజు, బిందు, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆర్.రాజేష్, సోషల్ వర్కర్ సిహెచ్.శ్రీకాంత్, కౌన్సిలర్ బాలాస్వామి, ఒమల్లిక, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలుర వసతి హోమ్‌లోని పిల్లందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ప్రభుత్వాసుపత్రిలోని ఎర్లీ ఐడెంటిఫికేషన్ సెంటర్ నుండి వచ్చిన సైకాలజిస్టులతో పిల్లల మానసిక స్థితిని, ఎదుగుదల ప్రభావాన్ని అంచనాకు అవసరమైన పరీక్షలు నిర్వహించారు.

మిర్చి తోటల పరిశీలన
ప్రజాశక్తి వార్తకు స్పందన

ముసునూరు : మిర్చి రైతుల సమస్యపై 'మిర్చికి తెగుళ్ల బెడద' అనే శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఉద్యానవన శాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక స్పందించి మండలంలోని వలసపల్లి గ్రామంలో మిర్చి సిబ్బందితో కలిసి మిర్చి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నారు నాటే సమయంలో ఇమిడా క్లో ప్రిడ్ అనే మందు నారుపై పిచికారీ చేయాలని, అదేవిధంగా బొబ్బర తెగులు రాకుండా ఫ్యూడేండర్ మందు జాగ్రత్త వర్షాగా పసుపు అట్టలను ఎకరానికి పది నుంచి పన్నెండు అట్టలను పొలంలో వేలాడ తీసే జిగురుకు పురుగు నశిస్తుందని తెలిపారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేస్తున్న చుక్కపల్లి సుధ

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఆగిరిపల్లి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనటం వలన దేహదారుఢ్యంతో పాటు, శారీరక, మానసిక ప్రశాంతత నెలకొంటుందని చుక్కపల్లి చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి చుక్కపల్లి సుధ అన్నారు. బుధవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విలువైన క్రీడా సామాగ్రిని ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతిరహిత రాష్ట్రంగా ఎపి

ముదినేపల్లి : అవినీతిరహిత ఆంధ్రప్రదేశ్ జగనన్న ప్రభుత్వ ఆశయం అని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన 'రండి కలిసి అవినీతిని అరికడదాం' అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ఎవరైనా లంచం అడిగితే వెంటనే మీ ఫోన్‌లో ఆడియో గాని, వీడియో గాని రికార్డు చేసి 14400 యాప్‌కు పంపాల్సిందిగా కోరారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కఠినచర్యలు తీసుకుంటారన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

నూజివీడు రూరల్ : మండలంలోని దిగవల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం మామిడి తోటలలో పాటించవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి శాస్త్రవేత్త బి.కనక లక్ష్మి మాట్లాడుతూ తోటలలో పూత రావడానికి బ్లాక్ సల్ఫర్ మూడు గ్రాములు లీటరు నీటికి, మల్టీ కె 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సర్పంచి కొండలరావు, రైతులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

నూజివీడు రూరల్ : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దిగవల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీను మాట్లాడుతూ మెడికల్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పర్యటించి సుమారు 600 టోకెన్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో తలగం సుజాత, ఎంపిపి అక్కినేని శ్రీవాణి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సీజ్డ్ వాహనాల వేలం ద్వారా రూ.98 వేల ఆదాయం

చింతలపూడి : చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఎక్సైజ్ సూపరిడెంట్ అవులూరు ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. మొత్తం 13 వాహనాలకు గాను 12 వాహనాలు వేలంపాటలో వేలం అయినవి. మొత్తం రూ.98 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదే విధంగా వివిధ కేసులలో సీజ్ చేసిన నాటు సారాను, లిక్కర్‌ను ధ్వంసం చేసినట్లు తెలియజేశారు.

చంద్రబాబుకు బెయిల్ రావడంపై సంబరాలు

చింతలపూడి : చంద్రబాబు నాయుడుకి మధ్యంతర బెయిల్ రావటంతో ప్రగడవరం పంచాయతీలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీన్‌మార్ డప్పులతో టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో బుద్దాల నాగు పాల్గొన్నారు.

దళితులకు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన 27 పథకాలను వెంటనే అమలు చేయాలని టిడిపి నాయకులు మానేపల్లి రాజారావు డిమాండ్ చేశారు. ముత్యంపాడు గ్రామంలో చంద్రబాబు మధ్యంతర బెయిల్ ఇవ్వటంపై మహిళలతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు - ఘోరాలు

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు

నూజివీడు రూరల్ : చెక్ బౌన్స్ కేసులో విజయవాడకు చెందిన కంబల్ల రాజుకు నూజివీడులోని సెకండ్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.హరిబాబు సంవత్సరంకాలం సాధారణ జైలు శిక్ష, రూ.8 లక్షల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల పాటు జైలు శిక్ష ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

జీలుగుమిల్లి : తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు తెలిపారు. బుధవారం రాచన్నగూడెం చెక్‌పోస్ట్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా విరంకి సూర్యారావు తెలంగాణ రాష్ట్రం నుంచి రాచన్నగూడెం గ్రామానికి సంచిలో పెట్టుకొని 15 బాటిళ్ల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న డ్రైవర్‌పై కేసు

ముసునూరు : కోళ్ల వ్యర్థపదార్థాలను తరలిస్తున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యం.కుటుంబరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల కాత్రేనీపాడు గ్రామంలో లారీ ఆపకుండా అతివేగంగా లారీ నడపడంతో అనుమానం వచ్చి పట్టుకున్నామని తెలిపారు. డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు రప్పించి డ్రైవరుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అస్తవ్యస్తం.. డ్రెయినేజీ నిర్మాణం

నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్
పనులను పర్యవేక్షించని అధికారులు
బడాబాబుల నివాసాలు, దుకాణాల వద్ద నాణ్యంగా.. ఎస్‌సి, బిసి ప్రాంతాల్లో నాసిరకంగా నిర్మాణం
గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు - దిగమర్రు 165వ జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లిలో గత కొన్ని నెలలుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాడు. ఈ డ్రెయినేజీ నిర్మాణ పనులు సక్రమంగా జరగడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్, సూపర్‌వైజర్ వారి ఇష్టానుసారంగా, అడ్డదిడ్డంగా పనులు చేస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఒకచోట ఒకలా, మరోచోట వేరేలా పనులు చేస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడాబాబుల నివాసాలు, దుకాణాల ముందు డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రతిష్ఠంగా చేస్తున్నారని, ఎస్‌సి, బిసి ప్రాంతాల్లో నాసిరకం స్లాబ్ చేస్తున్నట్లు ఎస్‌సి, బిసి వర్గాల వాసులు ఆరోపిస్తున్నారు. తమ గృహాల, దుకాణాల ముందు నిర్మించే డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బడా బాబుల గృహాలు, దుకాణాల ఎదుట కాంట్రాక్టర్ 8 అంగుళాల మేర స్లాబ్ వేస్తుండగా, ఎస్‌సి, బిసి ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మించే చోట నాలుగు అంగుళాలు మాత్రమే స్లాబ్ వేస్తున్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. డ్రెయినేజీ పనుల్లో నిబంధనలు తుంగలో తొక్కి కాంట్రాక్టర్ అస్తవ్యస్తంగా నిర్మాణ పనులు చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇచ్చిన సూచనలు పాటించకుండా డ్రెయినేజీ నిర్మాణ పనులు చేస్తుండడంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్‌సిఎం చర్చి సమీపంలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణాల్లో సదరు కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకుండా పనులు చేస్తుండడంతో నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా డ్రెయినేజీ పనులు పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. సదరు కాంట్రాక్టర్‌ను బడాబాబులు మచ్చిక చేసుకుని వారికి ముడుపులు ఇస్తున్నారని, దాంతో వారి నివాస ప్రాంతాల్లో, దుకాణాల ముందు డ్రెయినేజీ నిర్మాణ పనులు నాణ్యతగా చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వచ్చి వెళ్లిపోతుండడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడు.

ఇష్టానుసారంగా మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ముదినేపల్లి సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. తాము చేసే సూచనలు గాని, సలహాలు గాని కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లు ఏమాత్రం తీసుకోవడం లేదన్నారు. ఏమైనా సూచనలు చేస్తే, నా ఇష్టం మేము ఇలాగే చేస్తాం, ఎవరు చెప్పినా వినం, మీ చేతనైది చేసుకోండి అంటూ సూపర్‌వైజర్ సందీప్ తమపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సర్పంచి తెలిపారు. సూపర్‌వైజర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ ఏ మాత్రం ప్రజా ప్రతినిధులను లెక్క చేయడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ముదినేపల్లి సెంటర్‌లో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలతో జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను గ్రామస్తులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులు

ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి
ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ సమావేశం బుధవారం స్థానిక యుటిఎఫ్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నూతన మండల శాఖ అధ్యక్షులుగా బి.జయరాజు, ప్రధాన కార్యదర్శిగా కట్టా శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు రవికుమార్, ఆలీ, సుభాషిణి, సీనియర్ నాయకులు జగన్మోహనరావు పాల్గొన్నారు.

శ్రీకోట మహిషాసురి హుండీ ఆదాయం రూ. 2.63 లక్షలు

నూజివీడు రూరల్ : పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీకోట మహిషాసురి మర్దని అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయం రూ.2.63 లక్షలు లభించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలన అధికారి యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ దేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం 28 రోజులకు గాను భక్తులు అమ్మవారి హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆదివాసీ పాస్టర్స్ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులుగా కురసం

టి.నరసాపురం : ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులుగా కురసం నిరీక్షణరావు ఎంపికయ్యారు. మండలంలోని మర్రిగూడెంలో ఆంధ్ర, తెలంగాణా పాస్టర్స్ ఐక్యవేదిక సమావేశం నిరీక్షణరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులుగా కురసం నిరీక్షణ రావు, ప్రధాన కార్యదర్శిగా మడివి ఫిలప్, ఉపాధ్యక్షులు గుండి ఫిలిప్, సహాయ కార్యదర్శి బండారు జాన్ బాబు, కోశాధికారి చింత సమూయేల్ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బెజ్జం రవిబాబు, ఉబ్బా యోహాను పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువతరానికి స్ఫూర్తి

ఏలూరు అర్బన్ : స్వాతంత్ర సమరయోధుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువతరానికి ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం పనిచేయటమే వారికి నిజమైన నివాళులని వారు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ఆర్ పేటలోని చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశం వడ్రం పనివాళ్ల సంఘం నగర కార్యదర్శి కొత్తల శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం నూలు దండ వేసి జోహార్లు అర్పించారు. అనంతరం చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తల శివకుమార్, బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గనిగంటి కోటేశ్వరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులు హరిప్రియ, వడ్రం పనివాళ్ల సంఘం నాయకులు కాటకోటి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అన్నేవారి గూడెం ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె.మస్తాన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పొట్టి శ్రీరాముల చిత్రపటంతో పాటు తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. దీనిలో భాగంగా పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నం ప్రేమ్‌కుమార్, డియల్ దీపిక, కె.సాహితి, డి.చైతన్య కృష్ణలకు పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

చింతలపూడి : రాష్ట్ర వ్యాప్తంగా కుల, మత బేధాలు లేకుండా గౌరవించే వ్యక్తి పొట్టి శ్రీరాములని చింతలపూడి మండల ఎంపిపి రాంబాబు తెలిపారు. మండలంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎంపిడిఒ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రామరావు, ఎంఇఒ-2 కిరణ్ బాబు, సెక్రటరి కుమార్ పాల్గొన్నారు.

పోలవరం : ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ బి.సుమతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

92 ఉపాధి హామీ పనులు గుర్తింపు

పోలవరం : ప్రగడపల్లి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ చట్టం 2024-2025 సంవత్సరంలో పనుల ప్రణాళికకు సంబంధించిన తుది గ్రామసభ బుధవారం నిర్వహించామని పోలవరం ఎన్ఆర్‌జిఎస్ ఎపిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరం 2024 - 2025లో చేపట్టబోయే పనుల ప్రణాళిక ప్రక్రియలో భాగంగా 92 పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భరత్, సర్పంచి కలుం బాపిరాజు, సెక్రటరి యు.రాజారావు, టెక్నికల్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

చింతలపూడి : రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. బుధవారం పట్టణ ముస్లింల స్మశాన వాటికలో బోర్‌ను ఎంఎల్ఎ సొంత నిధులతో వేయించగా, మోటార్ నిమిత్తం వైసిపి నాయకుడు జంగా చెన్నకేశవ రెడ్డి అందించిన రూ.25 వేల చెక్కును ఎంఎల్ఎ చేతుల మీదుగా ముస్లిం పెద్దలకు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు జంగా చెన్నకేశవ రెడ్డి పాల్గొన్నారు.

సరుకుల దారిమళ్లింపుపై విచారణ

జంగారెడ్డిగూడెం : స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సరుకులు దారి మళ్లింపుపై సమగ్ర విచారణ చేపట్టామని డివైఇఒ రామన్న దొర తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక జడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో డివైఇఒ రామన్న దొర మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సరుకులు వినియోగంపై విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పాఠశాల హెచ్ఎం లోవ కుమారిని విద్యార్థులకు వినియోగించే మధ్యాహ్న భోజన పథకం సరుకుల నిల్వ సంబంధిత వివరాలు అడిగి రికార్డులు పరిశీలించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

లక్ష్మయ్య మృతి తీరని లోటు

జంగారెడ్డిగూడెం : పేదల అభివృద్ధికోసం కమ్యూనిస్ట్ పార్టీలైన సిపిఐ, సిపిఎం ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు అందించడం కోసం ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్న మందపల్లి లక్ష్మయ్య మృతి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తెలిపారు. బుధవారం పట్టణానికి చెందిన మందపల్లి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా ప్రభాకర్ స్థానిక నూకాలమ్మ గుడివద్ద ఉన్న లక్ష్మయ్య ఇంటికి వెళ్ళి అయన భార్య సుబ్బాయమ్మ ను, కుమారులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపారని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేటలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యావ్యవస్థలో పలు సంస్కరణలు తెచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు లబ్ధిదారులకు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, దాసరి రాంబాబు, దాకారపు సూరిబాబు, యర్రా గంగాధర్ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

భీమడోలు : మండలంలోని పూళ్ళ గ్రామపంచాయతీకి చెందిన అప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల విశ్రాంత న్యాయ కార్యదర్శి వట్టి వీర వెంకట సత్యనారాయణ శతజయంతి పురస్కరించుకొని మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో సేవా సంక్షేమ కార్యక్రమాలను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు మానవత అధ్యక్షులు, ఆయన కుమారుడు వట్టి సుగుణాకర్ తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 1వ తేదీన పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చెందిన రోగులు, ఇతరులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసినట్లు మానవత అధ్యక్షులు తెలిపారు. ఇదేక్రమంలో 2వ తేదీన భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రోగులకు పౌష్టికాహార పంపిణీ, ఆ తర్వాత శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు నిపుణులతో కెరియర్ గైడెన్స్ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. 3వ తేదీన పూళ్ళ హైస్కూల్‌కు కంప్యూటర్ బహుకరణతో పాటు నేటితరం విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో విద్యా కుసుమాలకు అభినందన కార్యక్రమం, వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేయమన్నామన్నారు. ఇదేక్రమంలో ఆయన నివాసం వద్ద వృద్ధులకు, పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ లీలా ప్రసాద్, డాక్టర్ కళ్యాణ మహేశ్వరితో పాటు మానవత సభ్యులు పాల్గొన్నారు.

పేదల స్థలాలు మెరక చేయాలని పాదయాత్ర : సిపిఎం

ప్రజాశక్తి - మండవల్లి

ఇండ్ల స్థలాలు పూడిక చేసి పేదలకు న్యాయం చేయాలి, లేకుంటే ఎంఎల్ఎ ఇంటి వరకు పాదయాత్ర చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు తెలిపారు. తరుగుమూల పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను మెరకచేయాలని కోరుతూ లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం చేపట్టిన ఆందోళనకు ఆయన మద్దతు పలికి మాట్లాడారు. 2006లో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇండ్లు లేని 130 మంది నిరుపేదలను ఎంపిక చేసి ఇండ్ల స్థలాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆ స్థలాలను నేటికీ పూడిక చేయకపోవడంతో లబ్ధిదారులు ఆ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకోలేక అద్దె ఇళ్లల్లో నేటికీ అవస్థలు పడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ వెంటనే స్పందించి ఇల్లు పేదలు నిర్మించుకునేలా చేయాలని, లేకుంటే మండవల్లి నుంచి ఎంఎల్ఎ డిఎన్ఆర్ ఇంటి వరకు పాదయాత్ర చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం మండల తహశీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధుల రాముడు, గిరిజాల బాపన్న చారి, రుద్ర రుతమ్మ, ఎర్రంశెట్టి నాగలక్ష్మి, రోజా పాల్గొన్నారు.

'ఎంఎల్ఎ డిఎన్ఆర్ వేధిస్తున్నారు..'

ముదినేపల్లి : కైకలూరు నియోజకవర్గంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు(డిఎన్ఆర్), అతని కుమారులు వైసిపికి చెందిన ఎస్‌సి, బిసి, ఎస్‌టి, మైనార్టీలపై అక్రమ కేసులు పెట్టి అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగజగన్ బాబురావు, రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షులు ఏసుపోగు దానియేలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ అధ్యక్షుడు కొయ్య మోషన్ రాజును భీమవరంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గంలో దూలం నాగేశ్వరరావు, ఆయన కుమారులు వైఎస్ఆర్ పార్టీ అభిమానులైనటువంటి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం మైనారిటీల మీద తప్పుడు కేసులు పెట్టి తన సామాజిక వర్గం వారైనటువంటి వేరే పార్టీ వారికి పదవులు కట్టబెట్టుతున్నారన్నారు. పార్టీని నమ్ముకున్న వారిని అవమానపరుస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలంటే కైకలూరు నియోజకవర్గానికి నూతన ఇన్‌ఛార్జిని ఏర్పాటు చేయాలని కోరారు.

డ్రెయిన్ల నిర్మాణ పనులు పరిశీలన

ముదినేపల్లి : మండలంలోని గురజ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో గ్రామంలో నిర్మిస్తున్న నూతన డ్రెయిన్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపిపి ఆర్.సత్యనారాయణ పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. గ్రామస్తులు తెలిపిన సమస్యపై ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు స్పందించి డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామంలో 15 రోజులుగా డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

కళ్యాణమస్తు బంగారు నాణెం అందజేత

ముసునూరు : విజయ డైరీ పాల కేంద్రం కళ్యాణమస్తు పథకం ద్వారా పెళ్లి కుమార్తెకు రూ.20 వేల విలువ గల గోల్డ్ కాయిన్ విజయ డైరీ సొసైటీ అధ్యక్షులు గాజుల ఏడుకొండలు అందజేశారు. మీగడ భద్రాచలం కుమార్తె పెళ్లి సందర్భంగా మేనేజరు కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అందించారు.

4, 5 తేదీల్లో ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వున్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు నమోదు నిమిత్తం స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్.ఖాజావలి తెలిపారు. ఈ క్యాంపెయిన్ ఈనెల 4, 5 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారుల ఆధ్వర్యంలో ఇఆర్ఒ, ఎఇఆర్ఒ పర్యవేక్షణలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించబడతాయన్నారు. కావున ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారులే కీలక బాధ్యత వహించాలని ఓటు నమోదు అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్.ఖాజావలి తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితాలను ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే సంబంధిత ఫారాల్లో నమోదు చేయాలని తెలిపారు. ఈనెల 4, 5, డిసెంబరు 2,3 స్పెషల్ డ్రైవ్ ఉంటుందని ఆ తేదీల్లో బిఎల్ఒలు పోలింగు కేంద్రాల వద్దే ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎవి రమణారావు, ఎంపిడిఒ కార్యాలయ సూపరిండెంట్ యు.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు దెందులూరు నియోజకవర్గ 293 పోలింగ్ కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పెదవేగి తహశీల్దార్ నల్లమెల్లి నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో స్పెషల్ ఓటర్ల నమోదు కార్యక్రమాలు నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఓటర్ల సవరణ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అసిస్టెంట్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బూత్ లెవెల్ పోలింగ్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థిని ఎంపిక

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ శ్రీఅన్నేరామ కృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి విద్యార్థిని జూడో గేమ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుని దుర్గామల్లేశ్వరి తెలిపారు. అనంతపురం జిల్లా జూడో గేమ్‌లో శ్రావణి 7వ తరగతి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. హిందీ టీచర్ మల్లేశ్వరి రూ.500 క్రీడాకారునికి సహాయం చేశారు. జాతీయస్థాయి పోటీలు జమ్ముకాశ్మీర్‌లో జ రుగుతాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర, క్రీడాకారినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రావు, సాకారవి, పుల్లారావు, బాలు, మనోహారం, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

NOTICE

BEFORE THE MOTOR VEHICLES ACCIDENTS CLAIMS TRIBUNAL: IV ADD'S DISTRICT JUDGE : TANUKU.
M.V.O.P. No.6/2022

Between :
సైపురెడ్డి త్రిమూర్తులు, తండ్రి : వెంకటస్వామి, వయస్సు, 56 సం॥, నివాసం : తూర్పు విప్పర్రు, ఇరగవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534 320. ఫోన్ : 79896 63375. ...పిటీషనర్
మరియు
కొల్లి ఝాన్సీ మరియు 3 ఇతరులు, 1వ ప్రతివాది, కొల్లి ఝాన్సీ, భర్త : వెంకట రామయ్య, నివాసము : డోర్ నెం.3-164/2, బాపిరాజు గూడెం, పెదవేగి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 534 006.
(APS RTC అద్దె బస్సు ఒనర్-బస్సు నెం.AP 37 TE 6000) ...రెస్పాండెంట్స్

పై నెంబరు గల పిటిషన్ లోని పిటీషనర్ తనకు ప్రమాద భీమ సొమ్ము కొరకు పై కోర్టు లో పిటీషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారి ద్వారా 1వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు నోటీసు పంపించినను మీరు ఆ నోటీసును తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున మీకు పేపర్ పబ్లికేషన్ ద్వారా పంపించవలసినదిగా శ్రీ కోర్టు వారు ది.31-10-2023 నాడు ఆర్డర్ వేసియున్నారు. సదరు ఆర్డరు ప్రకారం మొదటి ప్రతివాది అయిన మీకు ఈ నోటీసు ద్వారా తెలియజేయనది ఏమనగా పై పిటీషన్ వాయిదా 20-12-2023 అయి ఉన్నది. కావున మొదటి ప్రతివాది అయిన మీరు ఆ రోజు ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరుగాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ సమాధానమును తెలుపవలసినదిగా కోరడమైనది. లేనియెడల మీ పరోక్షమున పై పిటీషన్‌ను తీర్మానించబడును.

వాయిదా తేది.20-12-2023.
సి.హెచ్. శ్రీనివాస రావు,
ఎ.సువర్ణ,
పిటీషనరు తరుపు అడ్వకేట్స్,
తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా,
సెల్: 96760 28298, 94902 25090.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ మరియు ప॥గో॥జిల్లా, భీమవరం మండలం, భీమవరం నివాసి బొండా రామకృష్ణారావు, S/o. బొండా కృష్ణమూర్తి గారు నాకు తెలిపిన సంజాయిషీపై ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ ది. 26-12-2005 సం॥ తేదీన వారి తండ్రి గారైన కృష్ణమూర్తి గారి ద్వారా భీమవరం గ్రామంలో R.S. No. 398/7 లో 64.55 చ॥గ॥ స్థలాన్ని అందులోని బిల్డింగ్‌ని భీమవరం సబ్ రిజిష్టర్ ఆఫీస్‌లో రిజిస్టర్ నెంబర్ 7633/2005 గా దాన సెటిల్మెంట్ దస్తావేజు ద్వారా పొంది ఉన్నారు. సదరు దస్తావేజును నా క్లయింట్ ది. 20-10-2023 తేదీన షాప్ నుండి ఇంటికి తీసుకు వెళుతుండగా వెంకట్రామ టాకీస్ రోడ్డులో దస్తావేజు కవర్ పడిపోయినది. పైన వివరించిన ది. 26-12-2005 నాటి R.S. No. 398/7 స్థలం తాలూకు దస్తావేజు కవర్ ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు. సదరు దస్తావేజు ఆస్తితో ఎవరైనా లావాదేవీలు జరిపిన యెడల అలాంటి లావాదేవీలు చట్ట ప్రకారం చెల్లనేరవు అని ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

మోగంటి శివకృష్ణ
భీమవరం అడ్వకేట్, భీమవరం
ది.01-11-2023 సెల్:9848539039

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 273/2020

Between:
Plaintiff: Bank of Baroda
(Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Kondeti Nageswara Rao and another

వాది తరుపున చేయించిన ప్రకటన

ప్రతివాదులు:
1. కొండేటి నాగేశ్వరరావు, S/o. పెద్ద వెంకన్న, హిందువు, పురుషుడు, 50 సం॥లు, డో.నెం. 18-2-10, బిసి ట్యాంకు వీధి, పాలకొల్లు.
2. వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, హిందువు, స్త్రీ, 40 సం॥లు, డో.నెం. 27-4-18, బిసి ట్యాంకు వీధి, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు ఆదేశముల ప్రకారము ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku